వేగవంతంగా సర్వే వివరాల నమోదు


నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను వేగవంతంగా కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నామని చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న వెల్లడించారు. కాటేదాన్‌లోని స్పోర్ట్స్ కంప్లెక్స్‌లో కొనసాగుతున్న డాటా ఎంట్రీ ప్రక్రియను గురువారం ఆయన రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సర్కిల్‌లోని అన్ని డివిజన్లలో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడం జరిగిందన్నారు. కొంత మంది వివిధ కారణాలతో సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోలేదని అలాంటి వారి కోసం సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవన
ప్రారంభోత్సవానికి తరలిరావాలి


మాట్లాడుతున్న రమేష్‌కుమార్

బండ్లగూడ: కోకాపేట్‌లో ఈ నెల 14న దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కురుమ కులస్తులంతా తరలి రావాలని సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్‌కుమార్ కురుమ కోరారు. గురువారం బండ్లగూడ సంధ్యానగర్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కోకాపేట్‌లో కొత్తగా నిర్మించిన భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు.ఈ సమావేశంలో అనంతరాజు, లక్ష్మణ్, మనోహర్, మల్లేష్, పి.రమేష్, ఆంజనేయులు, విజయ్, కృష్ణయ్య, మల్లేశం, సత్యనారాయణ, బాబురావు పాల్గొన్నారు.

బలమైన శక్తిగా యువజన కాంగ్రెస్


మధుసూదన్‌రెడిని సన్మానిస్తున్న నాగేందర్‌రెడ్డి

అత్తాపూర్: రంగారెడ్డి జిల్లాలో యువజన కాంగ్రెస్ బలమైన శక్తిగా ఉందని జిల్లా అధ్యక్షులు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గురువారం ఆయన గ్రంథాలయ చైర్మన్ ఎల్లుగండి మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీమ్‌భరత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తామన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. యువజన కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేసేందుకు పాటుపడుతామన్నారు.

సిద్దిఖీ నగర్‌లో 6 భవనాలు సీజ్

20 మంది యజమానులకు నోటీసులు జారీ


సిద్దిఖీనగర్‌లో బిల్డింగ్‌ను సీజ్ చేసిన సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు

గచ్చిబౌలి: సిద్దిఖీనగర్‌లో అక్రమ నిర్మాణాల సీజ్ ప్రక్రియ మొదలైంది. గత కొద్ది రోజులుగా అక్రమ నిర్మాణాల లెక్కలు తేల్చేందుకు శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేపట్టారు. ఈ క్రమంలో పోలీసు బందోబస్తు మధ్య గురువారం ఆరు భవనాలను సీజ్ చేశారు. దీంతో అక్రమ నిర్మాణదారులకు ముచ్చెమటలు పడుతున్నాయి.

భవనం ఒరిగిన ఘటనపై..

సిద్దిఖీనగర్‌లో ప్లాట్ నంబర్ 1639లో 50 చదరపు గజాల స్థలంలో జి ప్లస్ ఫోర్ భవనం నిర్మించారు. నవంబర్ 19న ఆ భవనం పక్కకు ఒరగడంతో నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రమాదకరంగా ఉండటంతో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాలతో భవనాన్ని కూల్చివేశారు. ఈ క్రమంలోనే అధికారుల ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను గుర్తించారు. శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. అండర్ సెక్షన్ 451–ఏ ఆఫ్ జీహెచ్‌ఎంసీ యాక్ట్ 1955 ప్రకారం అక్రమ నిర్మాణాలను సీజ్ చేస్తున్నటు ఏసీపీ తెలిపారు. ఇప్పటికే 20 భవనాల యజమానులకు నోటీసులు జారీ చేశామని, మరి కొంతమందికి నోటీసులు ఇవ్వాల్సి ఉందన్నారు. సిద్ధిఖీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనాలకు నోటీసులు ఇచ్చి సీజ్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన మజ్లిస్ ఎమ్మెల్యే కౌసర్


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి తమ పార్టీ అధిష్టానం కట్టుబడి ఉందన్నారు. అదే విధంగా కార్వాన్ నియోజకవర్గంలో సరికొత్త అభివృద్ధి పనులు తాను ప్రతిపాదించామని వీటికి సరిపడ నిధులు కేటాయించాలని ఆయన మంత్రిని కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర మంత్రికి వినతి పత్రం సమర్పించారు. కార్వాన్ నియోజకవర్గం విద్యా పరంగా వెనుకబడి ఉందని నిరుపేదలు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారని ఆయన తెలిపారు. ప్రతిభ ఉండి కూడా ఎందరో పేదలు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక స్తోమత వారికి అడ్డంకిగా మారిందన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ఏర్పాటు ఎంతో అవసరమని దీనికి సరిపడ నిధులు కేటాయించాలని కోరారు.

- అదే విధంగా ప్రభుత్వ ఐటీఐతో పాటు పాలిటిక్నిక్ కూడా కార్వాన్ నియోజకవర్గంలో మంజూరు చేస్తే పేద కుటుంబాల పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని లంగర్‌హౌస్, కార్వాన్, టోలిచౌకీ తదితర డివిజన్‌లలో రోడ్ల రూపు రేఖలు మార్చడానికి సరికొత్త ప్రతిపాదనలు తాను సంబంధిత అధికారులకు సమర్పించడం జరిగిందని వాటిని పరిశీలించి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.
- అదే విధంగా నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ కూడా నాంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి చొరవ చూపాలని మంత్రికి వినతిపత్రం సమర్పించారు. నాంపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ వృత్తి కళాశాలలు దశాబ్దాల నాటి క్రితం ప్రారంభించబడ్డాయని వాటికి సరికొత్త యంత్రాలు అవసరమైన ఇతర బోధన సామగ్రిని కేటాయించాలని కోరారు. కాగా ఈ విషయాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తనను కలిసిన ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

అలరించిన 'రంగభూమి'

మాదాపూర్: చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో గురువారం సిస్టర్ నివేదిత స్కూల్ విద్యార్థులు రంగభూమి పేరిట 35వ వార్షిక సాంస్కృతిక మీట్ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక, దేశభక్తి గీతాలను, నృతాలను ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో చైర్మన్ పి. సుధాకర్‌రావు, కరస్పాండెంట్ యం.హరిహరప్రసాద్, ప్రిన్సిపల్ టి.లలితాకుమారి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆక్రమించేస్తాం..అడిగేదెవరు?

మంగరాశి కుంటలో అక్రమ నిర్మాణాలు

పంచాయతీ నుంచి ఇంటి నెంబర్లు జారీ

కోర్టు వ్యాఖ్యలతో చర్చనీయాంశం


ఖాళీ ప్లాటుకు కేటాయించిన ఇంటి నంబరు

శంషాబాద్ రూరల్: నీటి వనరుల సంరక్షణకు ప్రభుత్వం ఓ వైపు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోతుంటే.. అక్రమార్కులు ఏకంగా కుంటల్లో నిర్మాణాలు చేపట్టి నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తామంటూ సాగునీటి శాఖ జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ అక్రమార్కులు కోర్టును ఆశ్రయించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో కోర్టు వ్యాఖ్యలు కూడా అధికారుల వ్యవహార తీరును ఎండగడుతున్నాయి. మండలంలోని నర్కూడ రెవెన్యూలో ఉన్న మంగరాశి కుంటలో అక్రమ నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. ఈ విషయమై ఫిర్యాదులు రావడంతో పంచాయతీరాజ్, సాగునీటి శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 4న అక్రమ నిర్మాణాలను సాగునీటి శాఖ నుంచి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ శారు. దీంతో నిర్మాణదారులు కోర్టును ఆశ్రయించగా.. చట్టప్రకారం వెళ్లాలని కోర్టు సూచించింది.

అన్నీ అక్రమాలే..

నర్కూడలో ఉన్న మంగరాశి కుంట మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో కొంత భాగం పట్టా భూములు ఉన్నాయి. అయితే కుంటను ఆనుకుని ఉన్న పట్టాదారులకు చెందిన పొలం కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండడంతో వారు కొన్నాళ్ల కిందట అమ్మేశారు. ఈ భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు నిబంధనలకు విరుద్ధంగా కుంటను ఆనుకుని వెంచరు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా కుంట ఎఫ్‌టీఎల్‌లో ఎకరాకు పైగా భూమిలో కూడా ప్లాట్లు చేసి అమ్మేశారు. వీటిని కొనుగోలు చేసిన యజమానులు అందులో నిర్మాణాలు చేపట్టారు. కొన్ని నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. వీటిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు నోటీసులు జారీ చేసి, కూల్చివేతలకు చర్యలు చేపట్టారు.

మాజీ ప్రజాప్రతినిధుల అండతో?

పంచాయతీల్లో అక్రమ నిర్మాణాలతో మాజీ ప్రజా ప్రతినిధులకు కాసుల వర్షం కురుస్తోంది. ఇక్కడ జీఓ 111 నిబంధనల ప్రకారం.. లేఅవుట్లు, నిర్మాణాలకు పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు ఉండవు. దీంతో రియల్టర్లు మాజీ ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకుని వారి చేత అనుమతులు పొందుతున్నారు. అధికారం లేకపోయినా మాజీ సర్పంచులు పాత తేదీలతో అనుమతులు ఇస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ అనుమతులను అడ్డుపెట్టుకుని అక్రమ నిర్మాణాలకు ఇంటి నెంబర్లు కేటాయింపు, కరెంటు మీటర్ల జారీ చేయిస్తున్నారు. చివరకు ఈ పత్రాలతోనే కోర్టుకు వెళ్లి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా జాగ్రత పడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు..

మంగరాశి కుంటను ఆనుకుని, ఎఫ్‌టీఎల్‌లో ఉన్న వెంచరులో ఖాళీ స్థలాలకు సైతం పంచాయతీ నుంచి ఇంటి నెంబర్లు జారీ కావడం గమనార్హం. ప్రీకాస్టు గోడలు, గేటు ఏర్పాటు చేసిన ప్లాట్లకు జారీ అయిన ఇంటి నెంబర్లు యజమానులు అక్కడ దర్జాగా గోడపై రాసిపెట్టారు. ఈ అక్రమ నిర్మాణాలకు కరెంటు మీటర్లు సైతం జారీ అయ్యాయి.

హద్దులు ఏర్పాటు చేశాం..

మంగరాశి కుంట ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను రెండు నెలల క్రితమే ఏర్పాటు చేశాం. కొంత మంది వీటిని తొలగిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. కుంట ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన మూడు అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశాం. వారి వద్ద ఉన్న అనుమతి పత్రాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

–మౌనిక, ఇరిగేషన్ ఏఈ

కురుమ సంఘం పత్రిక ఆవిష్కరణ

శంషాబాద్ రూరల్: ఈ నెల 14న ప్రారంభించనున్న దొడ్డి కొమురయ్య కురుమ భవన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కవేలిగూడలో సంఘం పత్రికను జంగయ్య, శ్రీశైలం, విజయ్ కుమార్, రాజు, రమేష్, మహేందర్, శ్రీకాంత్, ఆవిష్కరించారు.

సర్కిల్ పరిధికి కొత్తగా 50 రిక్షాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో చెత్త సేకరించేందుకు కొత్తగా 50 రిక్షాలు తీసుకొచ్చారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలో ఇప్పటికే 30 రిక్షాలు ఉండగా అన్ని కాలనీలకు సరిపోకపోవడంతో మరో50 రిక్షాలను ఉన్నతాధికారులు మంజూరు చేశారు.

బోగస్ ఓట్లు తొలగించాలని ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: బోగస్ ఓట్లను తొలగించాలని నర్కూడ వాసులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. మండలంలోని నర్కూడ పంచాయతీ ఓటరు జాబితాలో స్థానికేతరులకు సైతం ఓటు హక్కు కల్పించారని పేర్కొన్నారు. పెళ్లి చేసుకుని వెళ్లిన వారు, వేరే చోట స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న చాలా మంది ఓటు హక్కును తొలగించకుండా పలువురు నాయకులు అడ్డుపడుతున్నారని విమర్శించారు. నర్కూడ పంచాయతీ పరిధిలో 3860 ఓట్లకు వెయ్యి వరకు బోగస్ ఓట్లు ఉన్నాయని ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు విశ్వనాథం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం

రాజేంద్రనగర్: ఇందిరమ్మ ఇళ్ల కోసం రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో అధికారులు సర్వే ప్రారంభించారు. గతంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించాలని ఉన్నతాధికారుల ఆదేశానుసారం గురువారం నుంచి రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లను ప్రారంభించారు.

నేడు శంకుస్థాపనలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లలో అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.3.12 కోట్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు. శుక్రవారం 3 గంటలకు శేరిలింగంపల్లిలో రూ.1.03 కోట్లు, గచ్చిబౌలిలో రూ.1.43 కోట్లు, కొండాపూర్‌లో రూ.66 లక్షలతో చేపట్టే సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొంటారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

గోల్కొండ: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పెద్దలకు డబ్బు సంచులు అందించడానికే ఆసక్తి చూపుతున్నారని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షు డు దేవర శ్రీనివాస్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లో ఆయన బీజేపీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ.. తమకు డబ్బులు మూటలు అందించడానికే కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎంపిక చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఆయన తెలంగాణను అప్పుల బాట పట్టిస్తున్నారని విమర్శించారు. సంవత్సర కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. రైతులు, నిరుద్యోగులకు ఉత్తుత్తి హామీలతో మోసం చేస్తోందన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన త రువాత ప్రజలకు మేలు చేకూర్చే ఒక్క పథకాన్ని కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టలేకపోయిందని అ న్నారు. సమగ్ర కుటుంబ సర్వే అంటూ ప్రజలకు మోసం చేస్తూ ముఖ్యమంత్రి కాలం గడుపు తున్నారని వ్యాఖ్యానించారు. కుటుంబ సర్వే ఏ విధంగా జరుగుతుందో ప్రజలందరికీ తెలుసన్నారు.

ముష్కీ చెరువు బఫర్‌జోన్‌లో కబ్జాలు

పీఎస్‌లో ఫిర్యాదు చేసిన ఇరిగేషన్ ఏఈ

గచ్చిబౌలి: గచ్చిబౌలి టీఎన్‌జీఓస్‌లోని ముష్కీ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ కబ్జాకు గురవుతుందని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి గురువారం గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ముష్కీ టీఎన్‌జీఓస్ కాలనీలో ప్లాట్లు అలాట్ అయ్యాయని కొందరు వ్యక్తులు మట్టి నింపి, ఫెన్సింగ్ వేసుకొని బోర్డులు పాతారు. గత మార్చి, ఏప్రిల్ నెలలో ఇదే మాదిరిగా చదును చేసి ప్లాట్లుగా విభజించి బేస్‌మెంట్లు కట్టడంతో ఫిర్యాదు అందుకున్న శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేసి బోర్డులను తొలగించారు. తాజాగా మళ్లీ ముష్కీ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో రాతి కడీలు, తీగలతో ఫెన్సింగ్ వేసి, ఆరు ప్లాట్లుగా విభజించి బోర్డులు నాటారు. స్థానికుల నుంచి ఫిర్యాదు రావడంతో ఏఈ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


ముష్కీ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వెలిసిన ప్లాట్లు, మట్టి పోసిన దృశ్యం



చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స

మాదాపూర్: చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలను కాపాడారు మెడికవర్ ఆస్పత్రి డాక్టర్లు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో గురువారం మెదులో బ్లాస్టోమా బ్రెయిన్ ట్యూమర్ సర్జరీకి సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అక్షర (12) తరగతి గదిలో తరచు నిద్రపోవడం గమనించిన టీచర్లు తల్లి దండ్రులకు విషయాన్ని తెలియజేశారు. వారు మెడికవర్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా అక్షరకు మెదడులో ట్యూమర్ ఉన్నట్టు గుర్తించారు. క్లిష్టమైనదిగా ఉండడం వల్ల ఆపరేషన్‌లో పక్షవాతం, ప్రాణాపాయం వంటి సమస్యలు ఉంటాయన్నారు. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మొదట ట్యూమర్‌ని తొలగించారు. ఆపరేషన్ తరువాత హైడ్రోసెఫలస్ అనే సమస్యకు గురవడంతో వెంట్రికులో పెరిటోనియల్ షంట్ కోసం రెండో సర్జరీ చేయాల్సి వచ్చిందన్నారు. అనంతరం మూడు నెలల పాటు కోమాలోకి వెళ్ళింది. చికిత్స అనంతరం కోమానుంచి బయటి పడింది. కార్యక్రమంలో డాక్టర్ నిత్య పాలపాటి ,సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నారి అక్షరతో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, వైద్యులు

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ


పూజలో పాల్గొన్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రేమావతిపేట్‌లో అయ్యప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, అలంకరణ చేశారు. 18 మెట్లపై కర్పూర హారతి వెలిగించి పూలు, పండ్లు, నూతన వస్త్రాలను స్వామి వారికి సమర్పించి మహాపడి పూజను నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

శాంతినగర్ కాలనీలో దొంగల బీభత్సం


శాంతినగర్‌లోని ఓ ఇంట్లో చిందరవందరగా పడేసిన సామగ్రి

బండ్లగూడ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోయారు. శుభకార్యాలు, బంధువుల ఇంటికి వెళ్లి వచ్చే సరికి ఇంటిని గుల్ల చేశారు. హైదర్షాకోట్ శాంతినగర్ కాలనీలో వరుసగా నాలుగు ఇళ్లలో దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి 12 తులాల బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ. ఐదు లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి


గౌతమ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు మండల డివిజన్ల వారీగా కమిటీలను వేయనున్నట్లు విద్యార్థి విభాగం కన్వీనర్ కట్టెలమండి గౌతమ్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో విద్యార్థి విభాగం చురుకుగా ఉందన్నారు. విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని వెల్లడించారు. గురుకులాలు, హాస్టళ్లు, కళాశాలలు, పాఠశాలల్లో తమ విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నామని వెల్లడించారు.

ఆగిఉన్న కారును ఢీకొన్న మరోకారు

స్వల్పంగా ధ్వంసం

రాజేంద్రనగర్: ఔటర్‌రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న కారును వెనుక నుంచి వచ్చిన మరోకారు ఢీకొట్టిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న ఎర్టిగా కారు ఉన్నట్టుండి ఆగిపోవడంతో పార్కింగ్ స్థలంలో నిలిపారు. కారులో ఉన్న నలుగురు రోడ్డు పక్కన నిలబడి వేచి చూస్తున్నారు. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న డిపెంబర్ వాహనం అదుపుతప్పి పార్కు చేసిన కారును ఢీకొట్టడంతో రెండు కార్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ధ్వంసమైన వాహనాలను ఓఆర్‌ఆర్‌పై నుంచి తొలగించారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టి..

యువకుడికి గాయాలు

శంషాబాద్: రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని సాతంరాయి రామాలయం వద్ద నివాసముండే అజయ్‌దాస్ (30) గురువారం ఉదయం టిఫిన్ తీసుకొచ్చేందుకు శంషాబాద్‌కు వెళ్లి వచ్చే సమయంలో కేఎల్‌సీసీ ఫంక్షన్ హాల్ సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో అజయ్‌దాస్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె సహా తల్లి అదృశ్యం


కూతురితో సంతోష

అత్తాపూర్: కుమార్తెతో సహా తల్లి అదృశ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన రమేష్, సంతోష(21) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నాడు. ఈ నెల 9న సంతోష తన కుమార్తె రిషిక(6)ను తీసుకొని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన భర్త రమేష్ బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వృద్ధుడి అదృశ్యం


వెంకటయ్య

శంషాబాద్ రూరల్: వేరే గ్రామంలో ఉన్న తన కొడుకు వద్దకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కవ్వగూడకు చెందిన వనరాసి వెంకటయ్య(75) చిన్న గోల్కొండలో ఉన్న తన పెద్ద కొడుకు అంజయ్య ఇంటికి వెళ్లడానికి గత నెల 22న బయలుదేరాడు. అంజయ్య ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. గతంలో ఇలాగే వెళ్లి కొన్ని రోజులకు ఇంటికి వచ్చాడు. ఈసారి కూడా వస్తాడని ఎదురు చూసిన కుటుంబ సభ్యులు ఎంతకీ రాకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు 'టీహబ్'లో హెల్త్ కేర్ సమ్మిట్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని 'టీహబ్'లో శనివారం ఉదయం 9గంటలకు నాల్గవ హెల్త్ కేర్ సమ్మిట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ' హైప్ వర్సెస్ రియాలిటీ: న్యూ జెన్ టెక్నాలజీ ఇన్ హెల్త్‌కేర్ డెలివరీ' అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహిస్తారు.